## సంధ్య థియేటర్ కేసును కొట్టివేయాలంటూ
# హైకోర్టును ఆశ్రయించిన అల్లు అర్జున్, థియేటర్ యజమాని

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 11 ప్రభాతవార్త:** పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు సంబంధించి సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ 105, 118 సెక్షన్ల కింద నమోదైన కేసును కొట్టివే యాలని న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పుష్ప2 బెనిఫిట్ షో సం దర్భంగా సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీ సులు కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్ థియేటర్‌కు వస్తున్న సమయంలో భద్రతాప రమైన జాగ్రత్తలు తీసుకోలేదంటూ థియేటర్ యాజమా న్యంపై కూడా కేసు నమోదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో కేసు కొట్టివేయాలంటూ అల్లు అర్జున్ హైకో ర్టును ఆశ్రయించారు. మరో వైపు సంధ్యాథియేటర్ యజ మాని కూడా కోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీ సులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అన్ని అవాస్తలేనని హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో ప్రస్తా వించారు. ప్రీమియర్ షోకు వస్తున్నట్లు పోలీసులకు ముందే సమాచారమిచ్చినట్లు అల్లు అర్జున్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అల్లు అర్జున్ పేరొందిన ప్రముఖ హీరో అని అభిమానులతో కలిసి గతంలోనూ చిత్రాలు చూశా రని ఆయన తరఫు న్యాయ వాది పిటీషన్‌లో తెలిపారు. సంధ్య థియేటర్‌లో పుష్ప2 చిత్రం ప్రీమియర్ షో చూసేందుకు వస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన ఏసీపీ, థియేటర్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చినట్లు వివ రించారు. **పలు సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం :** ప్రీమి యర్ షో సందర్భంగా బందోబస్తులో ఏసీపీతో పాటు డీసీపీ సైతం సంధ్య థియేటర్ వద్ద ఉన్నారని, ఆయన రావడం వల్లే తొక్కిసలాట జరిగిం దనడంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఈ కేసులో అల్లు అర్జున్ పేరు చేర్చడం పలు సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. అల్లు అర్జున్ పేరు చేర్చుతూ నమోదు చేసిన కేసును కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి దర్యాప్తుచేపట్ట కుండా తనను అరెస్ట్ చేయకుండా మధ్యం తర ఉత్త ర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై రేపు విచారణ నిర్వహించే అవకాశం ఉంది.

**హైకోర్టులో సంధ్యాథియేటర్ యజమాని పిటిషన్**

ఈ మేరకు ఈ థియేటర్ యజమాని రేణుకా దేవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ప్రమాదంపై రేవతి కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు ఆధారంగా చిక్కడపల్లి పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు సంధ్యా థియేటర్ భాగస్వామి ఎం.సందీప్(37)తో పాటు మేనేజర్ ఎం.నాగరాజు(51), లోయర్ బాల్కాని ఇంచార్జ్ జి.విజయచందర్(53)లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ సం దర్భంగా అరెస్టు, జరిగిన సంఘటనలను సవాల్ చేస్తూ థియేటర్ యజమానుల్లో ఒకరైన రేణుకాదేవి హైకో ర్టును ఆశ్రయించారు. రేవతి మృతితో తమకు సంబంధం లేదని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రీమియర్, బెని ఫిట్ షోలకు అనుమతి ఇచ్చిందని, పుష్ప2 సినిమాకు తాము ప్రీమియర్‌షోలు నిర్వహించలేదన్నారు. డిస్ట్రిబ్యూ టర్లే నేరుగా సినిమాను నడిపించుకున్నట్లు చెప్పారు. అయినప్పటికీ తమవంతుగా బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. కానీ తమపై వివిధ సెక్షన్లకింద కేసు నమో దు చేశారని, ఇది అన్యాయమని అందులో పేర్కొన్నారు.

# మోహన్‌బాబుకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** సినీ నటుడు మోహన్ బాబుకు హైకోర్టులో ఊరట లభించింది. బుధ వారం నాడు విచారణకు హాజరు కావాలని రాచకొండ పోలీసులు ఇచ్చిన నోటీసులపై జస్టిస్ విజయసేన్ రెడ్డి ధర్మాసనం స్టే విధించింది. ఈ నెల 24వ తేదీ వరకు విచారణకు హాజరయ్యేందుకు మోహన్‌బాబుకు హైకోర్టు మినహాయింపునిచ్చింది. టాలీవుడ్ నటుడు మోహన్ బాబుకు పోలీసుల విచారణ నుంచి తాత్కాలికంగా ఊరట కలిగింది. జల్‌పల్లిలోని ఆయన ఫాం హౌజ్ వద్ద జరిగిన గొడవల సందర్భం గా మీడియా సిబ్బందిపై మోహన్ బాబు స్వయంగా దాడికి దిగడం తెలిసిందే. ఇదే సమయంలో ఆయన తనయుడు మనోజ్‌ను కూడా బౌన్సర్లు దాడి చేయడం విదిత మే. ఓవైపు మనోజ్ ఫిర్యాదు మరో వైపు జర్నలిస్టు సంఘాల ఫిర్యాదు నేపథ్యంలో మోహన్ బాబుకు రాచకొండ పోలీసులు మంగళవారం రాత్రి నోటీసులు జారీచేసి బుధవారం ఉదయం పదిన్నర గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. దీంతో పాటు విష్ణును కూడా విచారణకు రావాలని ఆదేశించారు. పోలీసుల విచా రణకు విష్ణు హాజరైనా మోహన్ బాబు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం వల్ల హాజరు కాలేదు. ఇదే సమయంలో పోలీసుల నోటీసులపై మోహన్ బాబు తరపున ఆయన న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ పోలీసుల నోటీసులపై స్టే ఇవ్వాలని కోరారు. అయితే దీనిపై ప్రభుత్వ తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. మోహన్ బాబు మీడియా సిబ్బందిపై దాడికి పాల్పడ్డారని, పోలీసులతోనూ దౌర్జన్యంగా వ్యవహరించారని ఆయన వాదించారు. దీనిని డిఫెన్స్ న్యాయవాది ఖ ండించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పోలీసులు నోటీసులు ఇచ్చారని ఆయన ఆరోపించారు. రక్షణ కల్పించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని డిఫెన్స్ న్యా యవాది తెలిపారు. మోహన్ బాబు ఇంటి వద్ద పోలీసుల గస్తీ వుండేలా చూడాలని కోరగా ఇది సాధ్యం కాదని, రెండు గంటలకోసారి గస్తీ పోలీసులు ఆయన ఇంటి వద్దకు వస్తారని, పరిస్థితులను సమీక్షిస్తారని ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం పోలీసుల నోటీసుపై స్టే విధించింది. ఏడాది పాటు మోహన్‌బాబు ఎలాంటి గొడవల్లో తల దూర్చకూడదని ఆదేశించింది. దీంతో పాటు లక్ష రూపాయల పూచీకత్తు సమర్పించాలని పేర్కొంది. మోహన్ బాబు పో లీసుల విచారణకు హాజరయ్యేందుకు హైకోర్టు ధర్మాసనం ఈ నెల 24వ తేదీ వరకు మినహాయింపును ఇచ్చింది.

## ఆసుపత్రిలో మోహన్‌బాబుకు చికిత్స

**అధిక బిపి, కొన్ని గాయాలతో వచ్చిన మోహన్‌బాబుకు చికిత్స కొనసాగుతుంది: గురు ఎన్.రెడ్డి**

**మానాన్న మమ్మల్ని ఎక్కువగా ప్రేమించడమే ఆయన చేసిన తప్పు: మంచు విష్ణు**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 11 ప్రభాతవార్త:**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నటుడు మంచు విష్ణు

సినీనటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో ఏర్పడిన విభేదాల నేపథ్యంలో మంగళవారం రాత్రి మోహన్‌బాబు కాంటినెంటల్ ఆసుపత్రిలో చేరడం సంచలనంగా మారింది. అధిక బిపి, కొన్ని గాయాలతో ఆసుపత్రిలో చేరిన మోహన్‌బాబుకు చికిత్స అంది స్తున్నట్లు డాక్టర్లు బుధవారం ఉదయం హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ఈమేరకు మోహన్‌బాబు ఆరోగ్య పరిస్థితిపై బుధవారం ఉదయం కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్ గురు ఎన్.రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం బిపి ఎక్కువగా ఉందని, ఒంటి నొప్పులు ఉన్నాయని నటుడు మోహన్‌బాబు ఆసుపత్రిలో చేరాడని, ఆయనకు డాక్టర్ జగదీష్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రఘువీర్, కార్డియాలజిస్ట్ సిఎన్.మూర్తిల ఆధ్వర్యంలో చికిత్స కొనసాగుతుందని అన్నారు. మెడనొప్పితో పాటు కాళ్ల నొప్పులతో మోహన్‌బాబు బాధపడుతున్నారని, శరీరంపై కొన్ని గాయాలతో పాటు కంటి కింద వాపు వచ్చిం దన్నారు. మోహన్‌బాబుకు బుధవారం సిటీ స్కాన్ చేసి, చికిత్స విషయమై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**మమ్మల్ని ఎక్కువగా ప్రేమించడమే ఆయన చేసిన తప్పు: మంచు విషు:** మా నాన్న మమ్మల్ని ఎక్కువగా ప్రేమించడమే ఆయన చేసిన తప్పు అని నటుడు మంచు విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. కాంటినెంటల్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంచు విష్ణు మాట్లాడుతూ తమ కుటుంబ సమస్యపై మీడియా సమావేశం ఏర్పాటు చేయాల్సి వస్తుందని ఏనాడు అనుకోలేదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉంటా యని, ఎవ్వరో ఒకరు తగ్గితే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. తమ ఇంటి సమస్యలను ఎక్కువగా చూపించేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. మంగళవారం జరిగిన ఘర్షణలో మోహన్‌బాబుకు గాయాలు అయ్యాయని తెలిపారు. తన తండ్రి ఏమి సంపాదించినా అది ఆయన సొంతమని, రెండు చొక్కా లతో ఉన్న ఊరి నుంచి వచ్చి ఎంతో ఎత్తుకు ఎదిగార న్నారు. ఆయన స్వయంక ృషితో సంపాదించుకున్న ఆస్థి ఆయన సొంతమన్నారు. తాను కన్నప్ప ప్రిపరేషన్ కారణంగా రెండు, మూడు రోజులు నగరంలో లేకపో వడంతో కుటుంబంలో సమస్యలు వచ్చాయని అన్నారు. తాను నగరంలో ఉంటే ఇంత జరిగేది కాదని, వినయ్ తనకు అన్నలాంటి వాడని అన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

### వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ స్పష్టం చేశారు. వారి డిమాండ్‌ను బట్టి ఒక్కొక్కటీ పరిష్కరించేందుకు తప్పకుండా ప్రయత్నిస్తామని చెప్పారు. విపక్షాల కుట్రలో ఇరుక్కోవద్దనీ, వారి ఉచ్చులో పడి భవిష్యత్తు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ధర్నా చౌక్‌నే మాయం చేసిన వాళ్లు మీ ధర్నాలకు అండగా ఉంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆశాలకు ఇప్పుడు మద్దతు తెలపడం కంటే పదేళ్ల కాలంలో వారి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదని నిలదీశారు. అప్పుడే వారి డిమాండ్లు తీర్చి ఉంటే వారు రోడ్డు ఎక్కే పరిస్థితి ఉండేది కాదు కదా అని ఈ సందర్భంగా మంత్రి దామోదర పేర్కొన్నారు.




## కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

### తాలిబన్ మంత్రి దుర్మరణం

**కాబూల్, డిసెంబరు 11:** ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో బుధవారం జరిగిన ఆత్మాహుతి బాంబు పేలుడులో తాలిబన్‌ప్రభుత్వంలోని శరణార్థుల వ్యవహారాలమంత్రి మరణించారు. ఈమేరకు ఆఫ్ఘనిస్తాన్ కేంద్రహోంశాఖ అధికారులు సమాచారాన్ని వెల్లడించారు. మంత్రిత్వశాఖలోపేలుడు సంభ వించడంతో శరణార్థుల వ్యవహారాలమంత్రి ఖలీల్ హక్కాని మరణించినట్లు తెలిపారు. ఈ పేలుడులో ఆతని అంగరక్షకులు సహా 12 మంది మృతిచెం దారు. మూడేళ్లక్రితం ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంచేజిక్కించుకున్న తర్వాత బాంబుపేలుళ్లలోమరణించిన ఉన్నతాధికారుల్లో హక్కానీ ఒకరు. అయితే ఈపేలుడుకు ఎవ్వరూ బాధ్యత వహించలేదు. ఖలీల్ రెహ్మాన్ హక్కాని మరణం తాలిబన్లకు పెద్ద దెబ్బపడినట్లే పేలుడు అనంతరం కార్యాలయ ప్రాంగణంలో గందరగోళ వాతావరణం నెలకొంది. పేలుడు కారణంగా పలువురు గాయపడ్డారు. పేలుడులో ఆత్మాహుతి బాంబర్‌కూడా మరణించాడు. ఘటనలో చాలామంది గాయపడ్డారు. ఈ దాడిని తాలిబన్‌ప్రభుత్వం ఖండిం చింది. తమ నాయకత్వాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో ఈ దాడిజరిగిందని వెల్ల డించింది. ఈ సంఘటన తర్వాత తాలిబన్‌భద్రతను పెంచడానికి ఇలాంటి దాడులు అరికట్టేందుకు అనేకచర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లొద్దని కెటిఆర్ చెప్పడం విడ్డూరం: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు11:** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లవద్దని కేటీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలకు పిలుపు నిచ్చారని, దీంతో బీఆర్ఎస్ మానసిక స్థితి ఏమిటో తెలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు బుధవారం నుంచి ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు వెళ్లొద్దని తన పార్టీ ఎమ్మెల్యేలకు కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షం ప్రతి దానిని రాజకీయం చేయాలని చూస్తోందన్నారు. కేటీఆర్ ఆశల పల్లకిలో ఉన్నారని, అందుకే నాలుగేళ్లలో అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎవరూ తొలగించలేరన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

# రబీ, వేసవి డిమాండ్‌ను అధిగమించాలి

### విద్యుత్‌పై ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాత వార్త:** తెలంగాణలో రబీ, వేసి డిమాండ్‌ను ఎలాంటి అడ్డంకులు లేకుండా అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో బుధవారం రాష్ట్రంలోని ప్రస్తుత విద్యుత్ సరఫరా స్థితిని సమీక్షిం చారు. అంతేకాకుండా ట్రాన్స్కో, విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించి కొనసాగుతున్న పనుల ప్రగతిని చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 400 కెవి, 220 కెవి, 132 కెవి ట్రాన్స్‌మిషన్ నెట్‌వ ర్క్‌కు ఎటువంటి అవాంతరాలు కలుగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలన్నారు. వేసవి ప్రారంభానికి ముందే అన్ని పథకాలను పూర్తి చేయ డానికి అనుబంధ లైన్ పనులతో పాటు, కొనసాగుతున్న ఇహెచ్‌వి సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన నెట్‌వర్క్ పనులను సమీక్షిస్తూ, గతంలో ఎదురైన సమస్యలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్ డిమాండ్ వేగంగా పెరగడాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే వేసవి కాలంలో ఎదుర్కొనే సమస్యలను గుర్తించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో ముందుగానే సమస్యలకు పరిష్కారాలను చేపట్టాలని, అదే సమయంలో పనులను సకాలంలో పూర్తి చేయడానికి పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, ఇన్సులేటర్లు, పోల్స్ తదితర పరికరాలను తగినంత అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన మరియు విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ ఇంజనీర్‌లు ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో హాజరు కావడానికి వారి ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. వినియోగదారులకు సేవలను అందించడంలో ఏదైనా అలసత్వం ప్రదర్శించినట్లయితే దాన్ని తీవ్రంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రాన్స్కో సిఎండి డి. కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, ఎన్పీడీసీఎల్ కె. వరుణ్ రెడ్డి, ట్రాన్స్కో జెఎండి సి.శ్రీనివాసరావు, ట్రాన్స్కో, జెన్కో, డిస్కమ్‌ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు రూ.10వేల కోట్లు

### ఈ నెలాఖరుకు అందుబాటులోకి నిధులు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాత వార్త:** రాష్ట్రంలో రైతు భరోసాకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల మేర అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమలు చేస్తామని తెలంగాణ సర్కార్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా నిధులను సమకూర్చే పనిలో ఆర్థిక శాఖ నిమగ్నమైంది. దీంతో ఈ పథకానికి నిధుల సమీకరణ కొలిక్కి వచ్చినట్లు తెలియవచ్చింది. ప్రధానంగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) అధీనంలోని భూమిని తనఖా పెట్టి 10 వేల కోట్ల రూపాయల రుణం తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్థిక శాఖఅధికారులు వివిధ బ్యాంకులతో సంప్రదింపులు జరిపారు. పర్యవ సానంగా 9.6శాతం వార్షిక వడ్డీతో రూ.10వేల కోట్ల అప్పు ఇవ్వడానికి ఐసీఐసీఐ బ్యాంకు ముందుకొచ్చినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా ఈ రుణం అందే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా వెల్లడైంది. జనవరి నుంచి అమలు చేసే రైతు భరోసా పథకానికి ఈ సొమ్మును విని యోగించే అవకాశాలున్నట్లు తెలిపాయి. కాగా కోకాపేట, రాయదర్గంలో టీజీఐఐసీ అధీనంలోని 400 ఎకరాల భూముల్ని తనఖా పెట్టి అప్పు తీసుకోవాలని భావించిన సర్కారు, ఆ మేరకు భారత రిజర్వ్ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపింది. కానీ, వాటిని ఆడిటింగ్ కొర్రీతో ఆర్బీఐ వెనక్కి పంపింది. ఓవైపు ఈ ఆడిటింగ్‌ను కొలిక్కి తెచ్చే పనిలో ఉంటూనే, మరోవైపు బ్యాంకుల కన్సార్షియంతో టీజీఐఐసీ సంప్రదింపులు జరిపింది. ఆడిటింగ్ను పూర్తిచేసి, ఆర్బీఐని ఒప్పించే పనిలోపడింది. దీంతో ఐసీఐసీఐ బ్యాంకు రుణంఇవ్వడానికి ముందుకొచ్చింది. ఈనెలాఖరులోగా రూ.10వేలకోట్ల రుణం తీసుకునే అవకాశాలుఎక్కువగా ఉన్నాయనిఆర్థికశాఖ అధికారులు తెలిపారు.

# రాష్ట్ర ద్రవ్య లోటు రూ.56,063 కోట్లు

### సామాజిక రంగంపై రూ.1,27,123 కోట్ల ఖర్చు

### పన్నేతర ఆదాయంలో మాత్రం స్వల్ప పెరుగుదల

### తెలంగాణ10 యేళ్ల ఆర్థిక స్థితిగతులపై రిజర్వ్ బ్యాంక్ వెల్లడి

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** తెలంగాణ ద్రవ్య లోటు భారీగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్ర ద్రవ్య లోటు 56,063 కోట్ల రూపాయలకు చేరుకుంది. రాష్ట్రం ఏర్పాటైన 2014-15లో ఇది రూ.9,410 కోట్లుగా ఉండగా, అది ఈ పదేళ్లలో 46,653 కోట్ల రూపాయలకు పెరిగింది. ఎఫ్ఆర్‌బిఎం చట్టం ప్రకారం ద్రవ్య లోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ)లో 3 శాతానికి మించకూడదు. అయితే ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో ద్రవ్య లోటు 4.9 శాతంగా ఉంది. రాష్ట్ర జీఎస్డీపీరూ.13.5 లక్షల కోట్లు ఉంటుందనే అంచనా మేరకు, రాష్ట్ర ద్రవ్య లోటు కూడా 4 శాతం మించుతోంది. పలు సూచీల ఆధారంగా తెలంగాణలోని ఆర్థిక, విద్య, వైద్య, సామాజిక పరిస్థితులపై గణాంకాలు-2024తో కూడిన నివేదికను రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసింది. ఇందులో గత పదేళ్ల కాలంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలకాంశాలు వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం గత పదేళ్ల కాలంలో పన్నేతర ఆదాయంలో పెరుగుదల ఆశించినంతగా కనిపించలేదు. 2014-15లో 6,447 కోట్ల రూపాయలు ఉన్న పన్నేతర ఆదాయం స్వల్ప పెరుగుదలతో 2023-24లో 22,808 కోట్ల రూపాయలకు చేరింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే పన్నుల ఆదాయం (సొంత రాబడులు) పదేళ్ల కాలంలో బాగానే పెరిగింది. ఇది 2014-15లో 29,288 కోట్ల రూపాయలు మాత్రమే ఉండగా, 2023-24 నాటికి 1,31,029 కోట్ల రూపాయలకు పెరిగింది. రాష్ట్రం ఏర్పాటైన తొలి ఏడాదిలో 10 వేల కోట్ల రూపాయలు పెరిగిన సొంత ఆదాయం, వరుసగా మరో రెండేళ్ల అదేస్థాయిలో వృద్ధిని నమోదు చేసింది. కరోనా సమయంలో మాత్రం స్వల్ప హెచ్చుతగ్గులు నమోదు చేసిందని వెల్లడించింది. దీంతో 2018-19లో 65,040 కోట్ల రూపాయలు ఉన్న పన్నుల ఆదాయం, 2019-20లో 67,597 కోట్ల రూపాయలకు పెరగగా, 2020-21లో 66,650 కోట్ల రూపాయలకు తగ్గింది. కరోనా తర్వాతి ఏడాది 2021-22లో ఏకంగా 25 వేల కోట్లు పెరిగింది. ఆ తర్వాతి ఏడాది 10 వేల కోట్ల రూపాయలు, గత ఏడాదిలో 21 వేల కోట్ల రూపాయలు పెరిగి 1.31 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ఇక తెలంగాణ రాష్ట్ర నికర అప్పులు గ్యారంటీలు కాకుండా 2024 మార్చి నాటికి 3,89,673 కోట్లు రూపాయలుగా ఉన్నాయి. అదే 2015 మార్చి నాటికి ఇవి 72,658 కోట్ల రూపాయలు మాత్రమేనని పేర్కొంది. అలాగే గత పదేళ్లలో సామాజిక రంగాలపై ఖర్చు భారీగా పెరిగింది. సంక్షేమం, విద్య , వైద్యం, తాగునీటి సదుపాయాల కల్పన, పారిశుధ్యం తదితర అవసరాల కోసం చేసే ఖర్చు 2014-15లో 24,434 కోట్ల రూపాయలు ఉండగా, అది 2023-24 ముగిసే నాటికి 1,27,123 కోట్ల రూపాయలకు పెరిగింది. ఇక 11,583 కోట్ల రూపాయలుగా ఉన్న మూలధన వ్యయం, పదేళ్లలో 78,611 కోట్ల రూపాయలుగా నమోదైంది. కాగా తెచ్చిన అప్పులకు వడ్డీల కింద 5,227 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించగా, 2023-24లో వాటికి 22,408 కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని రిజర్వ్ బ్యాంక్ తన నివేదికలో పేర్కొంది.

## ఎక్సైజ్ పోలీసుల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

### కేరళ, తమిళనాడు, ఎపి, తెలంగాణకు చెందిన నిందితులు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ వినియోగానికి అలవాటుపడ్డ నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి రూ.1.25 లక్షల విలువైన డ్రగ్స్, బైకులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ అమీర్‌పేట ఎస్సార్‌నగర్‌లో తమిళనాడు, కేరళ, ఏపి, తెలంగాణకు చెందిన నలుగురు వ్యక్తులు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. అయితే, డ్రగ్స్‌ను కొనుగోలు చేయడం కష్టం అవుతుండటంతో బెంగళూరులోని ఒక డ్రగ్స్ వ్యాపారితో సంబంధాలు పెట్టుకుని అక్కడ కొనుగోలు చేసి తోటి ఉద్యోగులు ఇతరులకు అమ్మకాలు జరుపుతూ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్‌టిఎఫ్ సిఐ బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు బృందం హాస్టల్‌పై మం గళవారం రాత్రి దాడులు జరిపారు. ఈ దాడిలో 6.69 గ్రాముల ఎండిఎంఎ, 8.58 గ్రాముల హషీష్ అయిల్, 2.29 ఓటీ కుష్ డ్రగ్స్ లభిం చాయి. ఈ డ్రగ్స్ విలువ రూ.1.25 లక్షలుగా ఉంటుందని అధికారులు తెలి పారు. ఈ కేసులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉన్న ఆదర్శ, శ్రీజిత్, సంజయ్, డప్పుల అజయ్‌లను అరెస్టు చేసి, ఒక బైక్ కూడా స్వాధీనం చేసుకున్నారు.

## పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్ పొడిగింపు

**కొడంగల్,డిసెంబరు 11ప్రభాతవార్త:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేం దర్‌రెడ్డికి రిమాండ్ పొడగిస్తు కొడంగల్ కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. లగచర్ల ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గత నెల 13 నుంచి చర్లపల్లి జైలులో ఉన్నారు. కాగా నరేందర్‌రెడ్డికి కొడంగల్ కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ ముగియడంతో ఈనెల 24 వరకు పొడగిస్తూ మెజిస్ట్రేట్‌ఉత్తర్వులు జారీ చేశారు. నరేందర్‌రెడ్డితో పాటు ఇదే కేసులో నిందితు లుగాఉన్న మిగితా వారి రిమాండ్ కూడా కోర్టు పొడగించింది. అలాగే నరేం దర్‌రెడ్డి కస్టడీకి పోలీసులు మరోసారి పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

## సిఎం కాన్వాయ్‌ను ఢీకొట్టిన కారు

### ముగ్గురు పోలీసులతో సహా ఐదుగురికి గాయాలు



**జైపూర్, డిసెంబరు 11:** రాంగ్‌రూట్‌లో వచ్చి సీఎం కాన్వాయ్‌ను ఢీకొట్టిన ప్రమాదం రాజస్థాన్‌లో జరిగింది. ఆకారుతోపాటు సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. ముగ్గురుపోలీసులతో సహా ఐదుగురు గాయపడ్డారు. సీఎం వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. రాజస్థాన్‌రాజధాని జైపూర్‌లో బుధవారంమధ్యాహ్నం 3 గంటలకు ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖర్‌తోకలిసి నైపుణ్యాభివృద్ధికేంద్రాన్ని ప్రారంభిం చేందుకు సీఎం భజన్‌లాల్‌శర్మ తన కాన్వాయ్‌లో బయలుదేరారు. కాగా అక్షయపాత్ర కూడలి వద్ద రాంగ్‌సైడ్‌నుంచి వచ్చిన ట్యాక్సీ కారు సీఎం కాన్వాయ్‌లోని తొలిరెండు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఆకస్మిక ఘటనతో కాన్వాయ్‌లోని ఇతరవాహనాలకుబ్రేకులు వేయడంతో మరో వాహనం డివై డర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పోలీసులతోపాటు ట్యాక్సీకారు డ్రైవర్‌మరో వ్యక్తి గాయపడ్డారు. మరోపక్క ఈ సంఘటన వెంటనే సీఎం భజన్‌లాల్‌శర్మ కారునుంచి కిందకు దిగారు. గాయపడినవారిని ఆసు పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడినసురేంద్రసింగ్ పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య అధికారి తెలిపారు. తలకు గాయమైన ఆతడు వెంటిలేటర్‌పై ఉన్నట్లుచ ఎప్పారు. కాగా సీఎం భజన్‌లాల్‌శర్మ కాన్వాయ్‌ప్రమాదానికి సం బంధించిన ఫోటోలు విడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ఎన్‌డిఎ ప్రభుత్వానికి సభను నడిపించే ఆలోచనలేదు

### భువనగిరి ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త:**



ఎన్‌డిఎ పాలకులు సభను నడిపించే ఉద్దేశ్యంలేదని ఉభయసభలలో ఇదే పరిస్థితి నెలొకొందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపిం చారు. ఢిల్లీలో విలేఖరులతో బుధవా రం ఆయన మాట్లాడుతూ గత పదిరో జులుగా సమావేశాలు నవడవకుండా ఇం డియా కూటమి ఎంపిలు అడ్డుకొం టున్నారని మామీద దుష్ప్రచారం చేస్తున్నా రని దుయ్యబట్టారు. ఆదాని,సంబల్ ఘటన ,మణిపూర్ అంశాలపై సభలో చర్చిం చాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయని ఆయన గుర్తుచేశారు. కావాలని సభను వాయిదా వేస్తున్నారని ఆవేన చెందారు. సభను నడిపించే ఆలోచన వారిలో లేదని వైఫల్యాలు కప్పిపుచ్చుకొనే ప్రయత్నంలో ఎక్కడ వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయో అని ఈ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. సభలో అన్నిరాజకీయపార్టీలకు అవకాశం కల్పించాలని ఆయ న కోరారు. ప్రతిపక్షం ఎంపిలకు అవకాశం ఇవ్వడంలేదని ఆయన అన్నారు.

## సచివాలయంలో నేటి నుంచి ఫేషియల్ రికగ్నేషన్ హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధిహైదరాబాద్,డిసెంబరు11:** తెలంగాణ సచివాల యంలో కీలక మార్పులుచేపట్టారు. ఇకపై సచివాలయంలో ఫేషియల్ రికగ్ని షన్ హాజరు వేయనున్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ విధానం వర్తింప జేయనున్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయ హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతిఉద్యోగికి ఫేషియల్ రికగ్నిషన్ విధానంలో హాజరు తీసుకున్న తర్వాతేలోపలికి అనుమతించనున్నారు. అయితే ఈ కొత్తహాజరు పద్ధతి గురువా రంనుంచి అమలులోకివస్తుందని సచివాలయనిర్వహణాధికారులు పేర్కొన్నారు.

## రాజకీయరంగు పులమడం తగదు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త:** ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శిక్షణాతరగ తులను బిఆర్ఎస్ బాయ్‌కాట్ చేయడం దానికి రాజకీయ రంగు పులమడం మంచిది కాదని నీటిపారుదలశాఖ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాజీవ్ గాంధీ, తెలంగాణతల్లి విగ్రహం తొలగించే అవకాశం బిఆర్ఎస్‌కు రాదన్నారు. రాష్ట్రం లో మరోపదేళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. పార్లమెంట్, అసెంబ్లీ, కౌన్సిల్ ప్రజాస్వామ్యానికి దేవాలయ వం టివని వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు దీనికోసం ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక పద్ధతి ప్రకారం ప్రవర్తించాలని కోరారు. రాను రాను వ్యవస్థల పట్ల గౌరవం తగ్గుతుందని ఆవేదన చెందారు. సభయల హాజరుసభలు జరగుతున్నరోజులు తగ్గుతున్నాయని ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

**సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కేరళ**
(కేంద్రీయ విశ్వ విద్యాలయాల చట్టం, 2009 క్రింద స్థాపించబడింది)
తేజస్విని హిల్స్, పెరియే P.O, కాసరగోడ్-671320

No. CUK/RC/FO/2023 తేదీ: 14.11.2024

**ఉద్యోగ ప్రకటన**
**(నాన్-టీచింగ్)**

ఫైనాన్స్ ఆఫీసర్ యొక్క ఉద్యోగాన్ని ప్రత్యక్ష పద్ధతిపై భర్తీ నిమిత్తం అర్హులైన భారతీయ జాతీయుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి.
ఉద్యోగాల సంఖ్య, ప్రకటన నం, కేటగిరీ, అవసరమైన అర్హతలు, అనుభవం, జీతం, ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు వివరాలు వగైరా పూర్తి వివరాలు ఉన్న ప్రకటన యూనివర్శిటీ వెబ్‌సైట్: **www.cukerala.ac.in** వద్ద అందుబాటులో ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 31.12.2024, సా.5.00 గం.

CBC 21353/12/0001/2425 రిజిస్ట్రార్

# ఆయిల్‌ఫెడ్ నుండి అంగన్వాడీలకు సరుకులు

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లే

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు ఆయిల్ ఫెడ్ నుంచే సరుకులు సరఫరా చేస్తున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తెలిపింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ కాంతివెస్లే ఒక ప్రకటనలో సరుకులు నాణ్యంగా రావడంలేదన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రైవేటు వారికి వాటిని సరఫరా చేసే బాధ్యతను అప్పగించేది లదని స్పష్టం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులు సరఫరా చేయాలని అంన్వాడీ కేంద్రాలకు చెందిన టీచర్లు, వర్కర్ల నుంచి ఇటీవల వినతులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని తాము తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయితే అంగన్వాడీ కేంద్రాలకు సరుకులను పంపిణీ చేయలేమని ఆయిల్ ఫెడ్ నుంచి సైతం ఎలాంటి వినతి రాలేదని చెప్పారు. సరుకుల పంపిణీ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించలేదని ఆయన తేల్చిచెప్పారు.

# తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జితేందర్ రెడ్డి గెలుపు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు11:** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గెలిచారు. ప్రత్యర్థి చాముండేశ్వరీనాథ్ మీద ఆయన విజయం సాధించారు. గెలిచిన అనంతరం బుధవారం ఆయన మీడియాతో, మాట్లాడుతూ, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ వేదికగా అంత ర్జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీపై హడావుడి మాత్రమే చేసిందని విమర్శించారు. గతంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ హోదాలో కొందరు చీడపురుగులు ఉన్నారని దుయ్యబట్టారు. యువత మత్తుకు బానిస కాకుండా క్రీడల వైపు వచ్చేలా చేస్తామని జితేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నూతన క్రీడా పాలసీని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

# రాహుల్‌గాంధీని కలిసిన భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు11:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కలిశారు. బుధవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలిసి ఏడాది కాంగ్రెస్ పాలనలో సాధించిన విజయాలు, ఇటీవల నిర్వహించిన విజయోత్స వాల గురించి వివరించినట్లుగా సమాచారం. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం, రాజకీయ పరిణామాలు, ఇంకా భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పోస్టులు, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే తదితర అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లుగా సమాచారం. కాగా, బుధవారం ఉదయం ఆయన బెంగుళూరుకు వెళ్లి అక్కడ డిప్యూటీ సిఎం శివకుమార్‌ను కలిసి పలు అంశాలపై చర్చిం చినట్లు సమాచారం. తర్వాత ఆయన అక్కడ నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు.



# ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కోసం రైళ్ల దిగ్బంధం

**కూచ్‌బెహార్, డిసెంబరు 11:** ప్రత్యేకరాష్ట్రం డిమాండ్‌కోసం ఆందోళనకారులు అస్సాంలో రైళ్ల దిగ్బంధం చేపట్టారు. రైల్వేస్టేషన్‌వద్ద పట్టాలపై నిరసన తెలిపారు. దీనితో పలు రైళ్లు రద్దుకాగా మరికొన్ని దారిమళ్లాయి. ఈ నేపథ్యంలో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు, వాహనాల్లో వారిని గమ్యస్థానాలకు చేర్చారు. అస్సాంలోనిక ఊచ్‌బెహార్‌జిల్లాలో ఈ ఆందోళన జరిగింది. కూచ్‌బెహార్‌ప్రత్యేకరాష్ట్రం డిమాండ్‌కోసం గ్రేటర్ కూచ్‌బెహార్‌పీపుల్స్ అసోసి యేషన్ బుధవారం రైళ్ల దిగ్బంధానికి పిలుపుని చ్చింది. దీనితో ఆలీపుర్‌దౌర్ డివిజన్‌లోని జోరాయ్ రైల్వేస్టేషన్ వద్దకు ఐదువేలమందికిపైగా జనంచేరుకున్నారు. రైలుపట్టాలపై నిరసన తెలిపారు. రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. కాగా రైళ్ల దిగ్బంధంపై నార్త్ ఈస్ట్‌ఫ్రాంటియర్ రైల్వే స్పందించింది. న్యూజల్‌పాయ్‌గురి, గౌహతి, బొంగొగింవ్‌న్యూజల్‌పాయి గురి వందేభారత్‌ఎక్స్‌ప్రెస్‌రైళ్లతోసహా పలు రైళ్లనురద్దుచేసినట్లు వెల్లడించింది. బ్రహ్మపుత్ర మెయిల్, కామరూప్ ఎక్స్‌ప్రెస్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు వివేక్ ఎక్స్‌ప్రెస్ వంటి పలు రైళ్లను దారిమళ్లించింది. మరోవైపు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఈ క్రమంలోనే పలు రైల్వేస్టేషన్లలో చిక్కుకున్న ప్రయాణీకులకోసం బస్సులు ఇతర వాహనాలనురైల్వే అధికారులు ఏర్పాటుచేసారు. ఆ వాహనాల్లో ఇతర రైల్వేస్టేషన్లు, గమ్యస్థానాలకు చేర్చారు. అలాగే భద్రతకోసం భారీగా పోలీసులు ఆర్పీఎఫ్‌ను మొహరించారు.

# విపక్ష నిరసనల మధ్య రైల్వే సవరణ బిల్లుకు ఆమోదం



**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా పార్లమెంట్‌లోప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంది. విపక్ష ఎంపిల ఆందోళనల మధ్య రైల్వే సవరణ బిల్లు 2024కు లోక్‌సభ ఆమోదముద్రవేయించుకుంది. ఈ ఏడాది ఆగస్టు 9న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా రైల్వేసవరణ బిల్లునురైల్వేమంత్రి అశ్విన్‌వైష్ణవ్‌లోక్‌సభలోప్రవేశపెట్టారు. ఆ బిల్లుకు బుధవారం ఆమోదం లభించింది. రైల్వే సవరణ బిల్లు చట్టంగా మారితే రైల్వేల ప్రైవేటీకరణకు దారితీస్తుందని విపక్ష పార్టీల ఎంపిలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అందుకే బిల్లుకు వ్యతిరేకంగా వారు సభలో నినాదాలుచేసారు. కానీ విపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం రైల్వే సవరణ బిల్లు లోక్‌సభ ఆమోదముద్ర వేయించుకుంది. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఈ బిల్లుతో రైల్వేల ప్రైవేటీకరణ జరగదని రైల్వే బోర్డుపనితీరు మెరుగుపడుతుందని మంత్రి అశ్విని వైష్ణవ్‌చెప్పారు.

## సెల్‌ఫోన్ దొంగల భరతం పట్టిన సైబరాబాద్ పోలీసులు

# 45 రోజుల్లో 1100 ఫోన్ల జప్తు, బాధితులకు అందజేత

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** సైబరాబాద్ పోలీసులు మరోసారి సెల్‌ఫోన్ దొంగల భరతం పట్టారు. కేవలం 45 రోజుల వ్యవధిలో 1100 సెల్‌ఫోన్లను నేరగాళ్ల నుంచి జప్తు చేసి వాటిని బాధితులకు అందజేశారు.

ఈ సం దర్భంగా గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిసిఎస్ డి సిపి నరసింహా మాట్లాడుతూ సెల్‌ఫోన్ చోరీలకు సంబంధించిన కేసులను పసిగట్టేందుకు అందుబాటులో వున్న సిఈఐ ఆర్ టెక్నాలజి తో పాటు ఇతర సాంకేతిక పరిజ్ఞా నం ఆధారంగా నేరగాళ్ల ఆటకట్టిం చా మని తెలిపారు. పట్టుబడ్డ సెల్‌ఫోన్‌ల విలువ మూడు కోట్ల 30 లక్షల రూపాయల వరకు వుంటుందని ఆయన తెలిపారు. ఈ ఏ డాది ఇప్పటి వరకు 7500 సెల్‌ఫోన్‌లను నేరగాళ్ల నుంచి జప్తు చేశామని ఆయన తెలిపారు. ఇందులో 5500 సెల్‌ఫోన్ల పరికరాలు కూడా వున్నాయని ఆయన తెలి పారు. సెల్‌పోన్లను పోగొట్టుకున్న బాధితులు వెంటనే సమీప పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. పట్టుబడ్డ సెల్‌పోన్లలో మాదాపూర్ సిసిఎస్ పో లీసులు 235 ఫోన్లు, బాలా నగర్ సిసిఎస్ పోలీసులు 203 ఫోన్లు, మేడ్చల్ సిసిఎస్ పోలీసులు 185 ఫోన్లు, రాజేంద్రనగర్ సిసిఎస్ పోలీసులు 166 ఫోన్లు, శంషా బాద్ సిసిఎస్ పోలీసులు 151 ఫోన్లు వున్నాయి. సెల్‌ఫోన్ల జప్తులో, నేరగాళ్ల పట్టివేతలో కృషి చేసిన పోలీసులను డిసిపి నరసింహా అభినందించారు.



సెల్‌పోన్ దొంగల నుంచి జప్తు చేసిన సెల్‌ఫోన్లను బాధితులలకు అందజేస్తున్న సైబరాబాద్ సిసిఎస్ డిసిపి నరసింహా

# దేవాలయ భూముల కబ్జాపై న్యాయపోరాటం

## కార్యనిర్వహణాధికారులకు బాధ్యతలు
## కబ్జా భూముల స్వాధీనం సాధ్యం
## కాకపోతే లీజు వసూలు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** ఆక్రమణలకు గురైన భూములపై దేవాదాయ శాఖ ఫోకస్ పెట్టింది. ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న ప్పటికీ కబ్జాదారులు దారికి రాకపోవడంతో న్యాయ పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నది. తెలంగాణలో దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారం పరిధిలో మొత్తం 91827 ఎకరాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అందులో ఆరు వేల ఎకరాలు పొరుగున ఉన్న కర్ణాటక, ఏపి, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ఉండగా, సుమారు 25 వేల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని భావి స్తున్నారు. ఉన్న వాటిని కాపాడుకోవడంతో పాటు ఆక్రమణకు గురైన బూముల గురించి ఏం చేద్దామనే కసరత్తు ప్రారంభించింది. కబ్జాదారుల చెరలో ఉన్న భూములకు మార్కెట్ వాల్యూ ప్రకారం దర నిర్ణయించి వసూలు చేద్దామా లేకుంటే లీజు వసూలు చేద్దామా అనే అంశంపై దేవాదాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈ దిశగా ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నట్లు సమా చారం. రాష్ట్రంలోని దేవాలయాల నిర్వహణా బాధ్యతలను క్షేత్ర స్థాయిలో కార్యనిర్వహణాధి కారులు పర్యవేక్షిస్తుంటారు. వారికి ఆయా దేవా లయాల పరిధిలో ఉన్న భూములపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. రాష్ట్రంలో 704 టెం పుల్స్ కు 233మంది ఈవోలు ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం 164 మంది మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 69 మందిని నియమించాల్సి ఉంది. దీంతో ఒక్కో ఈవోకు అదనంగా ఆలయాల బాధ్యతను అప్పగించింది. ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునే విష యంలో ఏం చేయాలనే అంశంపై ప్రభుత్వం తీవ్ర కసరత్తును ప్రారంభించింది. అయితే ఎక్కువ మంది అధికారులు ఆ భూములకు మార్కెట్ రేటు ప్రకారం ఆక్రమనదారుల నుంచి వసూలు చేస్తే ఆదాయం వస్తుందనీ, కోర్టుల చుట్టూ తిరుగకుండా ఉంటుందని వచ్చే ఆదాయంతో ఆలయాలను అభివృద్ధి చేసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఆలయాల్లో ధూపదీప నేవేద్యం కోసం భూములను కేటాయించారు. భూముల్లో 25 వేల ఎకరాలు కబ్జాకు గురికావడంతో కొన్ని ఆలయాల్లో నిత్యం పూజల కైంకర్యం చేపట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆలయ భూములు కబ్జాలు గురై నివాసాలు ఏర్పాటు చేసుకోగా కొంతమంది సాగు చేసుకుం టున్నట్లు సమాచారం. దీంతో ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉదాహరణకు అత్తాపూర్‌లోని పద్మనాభస్వామి ఆలయానికి 4 ఎకరాల భూములు ఉండగా, చుట్టూ కబ్జా చేసి భవనాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు.

అలాగే, దేవరయాం జాల్‌లో దేవాదాయ శాఖకు 1500 ఎకరాల భూమి ఉంటే అందులో 800 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందని సమాచారం. అది కూడా ప్రస్తుతం లేదనీ 10 నుంచి 15 ఎకరలు మాత్రమే ఉందని తెలిసింది. అలాగే, మాదాపూర్‌లో గోరక్షణ ట్రస్టుకు చెందిన భూమి కూడా కబ్జాకు గురైందనీ, అందులో ప్రముఖులు ఉన్నట్లు అధికారులు పేర్కొం టూన్నరు. భూమిని తిరిగి స్వాధీనం చేసుకుందామంటే కాస్రా పహాణి లేదనీ, భూమి ఎంత ఉందో చెప్పడం కష్టమవుతుందని దేవాదాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల క్రమబద్ధీకరణ

## ప్రమాణాలకు అనుగుణంగా కొత్త విధానం విడుదల
## తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ మార్గదర్శకాలు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ లోని విద్యత్ క్యాప్టివ్ జనరేటివ్ ప్లాంట్ల (సిజిపి) పనితీరును క్రమబద్ధీకరించడానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టిజిఈఆర్సీ) కొత్త విధానాన్ని అమలు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ కొత్త విధానాన్ని ఈఆర్సీ విడుదల చేసింది. విద్యుత్ వినియోగం మరియు ఈక్విటీ షేర్‌హోల్డింగ్ ఆధారంగా సిజిపిలు, క్యాప్టివ్ యూజర్‌లు క్యాప్టివ్ స్టేటస్‌కు అవసరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా లక్ష్యంగా పెట్టుకుంది. క్యాప్టివ్ స్టేటస్ ధృవీకరణను క్రమబద్ధీకరించడానికి, సిజిపిలు, వాటి వినియోగదారులు విద్యుత్ చట్టంలో పేర్కొన్న అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని సిజిపి, వాటి అనుబంధిత వినియోగదారులు ఈ కొత్త విధానాన్ని అమలు చేయడం ద్వారా తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి మరియు వినియోగ వ్యవస్థలో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అన్ని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు, వారి అనుబంధ వినియోగదారులు తమ క్యాప్టివ్ స్టేటస్‌ని ధృవీకరించడం కోసం డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీకి విధిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీ ప్రతి సంవత్సరం జూన్ లోగా కమిషన్‌కు ఏకీకృత నివేదికను సమర్పించాలని అందులో స్పష్టం చేసింది.

అలాగే ఒక విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు లేదా క్యాప్టివ్ యూజర్ ఇచ్చిన సంవత్సరంలో అవసరమైన ప్రమాణాలను అందుకోవడంలో విఫలమైతే, వారు ఆ సంవత్సరానికి తమ క్యాప్టివ్ స్థితిని కోల్పోతారు. అయితే, అదే సిజిపిలోని ఇతర వినియోగదారులు అవసరమైన యాజమాన్యం మరియు వినియోగ ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగితే, వారు తమ క్యాప్టివ్ స్థితిని అలాగే ఉంచుకుంటారు. కాగా అర్హత పొందాలంటే, దాని యూజర్లు తప్పనిసరిగా ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో కనీసం 26 శాతం ఓటింగ్ హక్కులతో కలిగి ఉండాలి మరియు ఏటా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో కనీసం 51 శాతం వినియోగించాలి. ఇక ఒక ఉత్పత్తి ప్లాంటు సహకార సంఘం యాజమాన్యంలో ఉంటే, దాని సభ్యులు విధిగా 26 శాతం యాజమాన్యం మరియు 51 శాతం వినియోగ ప్రమాణాలను సమిష్టిగా సంతృప్తి పరచాలి. ధృవీకరణ ప్రక్రియలో క్యాప్టివ్ వినియోగదారుల విద్యుత్ వినియోగం, శక్తి నిల్వ వ్యవస్థల ద్వారా వారి వినియోగంతో సహా సమీక్ష ఉంటుంది. ఉత్పత్తి ప్లాంట్లు, సంబంధిత వినియోగదారులు ప్రతి ఏటా మే 31లోపు తమ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం మరియు గత ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ షేర్‌హోల్డింగ్ వివరాలతో అఫిడవిట్‌ను అందించాలి. పంపిణీ లైసెన్స్‌దారు ఈ సమాచారాన్ని విశ్లేషించి, సంఘటిత నివేదికను కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుందని కొత్త విధానంలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ స్పష్టం చేసింది.

# మేడసాని అవధాన జీవిత స్వర్ణోత్సవం

**రాష్ట్రపతి నిష్ణాతుల కోటాలో ఆయనకు రాజ్యసభ సభ్యత్వమివ్వాలి: దాసరి శ్రీనివాసులు**
**విజయవంతమైన మేడసాని 50వ అష్టావధానం**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 11 ప్రభాతవార్త :** గొప్పపురుషులు ప్రపంచమంతా కొనియాడబడుతారని, అలాంటివారిలో పంచ సహస్రావధాని డా. మేడసాని మోహన్ ఒకరని, ఆయనకు రాష్ట్రపతి నిష్ణాతుల కోటాలో రాజ్య సభ్యుడుగా అవకాశమివ్వాలని అభిప్రాయపడ్డ విశ్రాంత ఐఎఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు రసమయి ఆయనకు అవధాన జీవిత స్వర్ణోత్సవం నిర్వహించి ఘనంగా సత్కరించడంతోపాటు స్వర్ణకంకణం ప్రకటించడం అభినందనీయమని అన్నారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యా సంలో నా సాహితీ వాహిని జీవనంలో ఒదిగి పదం, భావం, రసం, ధ్వని, పాకం, ప్రాణం నీవే భారతి అన్న అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్, ప్రపంచ ప్రఖ్యాత పంచ సహస్రావధాన సార్వభౌముడుగా పేరుగాంచిన మేడసాని మోహన్ జీవిత స్వర్ణోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎంతగానో అభినం దించారు. అవధానం పంచాత్మక ప్రక్రియ అన్నా రు. పద్యం, అష్టావధానం తెలుగుజాతి సొంతం, మనందరికీ గర్వకారణమని, ఇప్పటికి ఎప్పటికీ పంచ సహస్రావధానం నిర్వహించిన ఏకైక అవధాని డా.మేడసాని మోహన్ అని శ్లాఘించారు. పద్యం భారతి హృదయపద్మము, తెలుగువాని రసవాద్యము, సంస్కృతీ వైభవాల వైశద్యము, హృద్యమాధ్యము, స్వజాతికిన్ అర్పితమైన స్వాదునైవేద్యము, సర్వదా విధురవేద్యము, దండమూ పద్యవిద్యకున్ అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యం లో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధ వారం రాత్రి ప్రపంచ ప్రఖ్యాత పంచ సహస్రావ ధాన సార్వభౌమ, అపూర్వధారణ చక్రవర్తి డా. మేడసాని మోహన్ అష్టావధాన జీవిత స్వర్ణోత్సవం తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఎఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, విశిష్ట అతిథులుగా జస్టిస్ బి.చంద్ర కుమార్, విశ్రాంత ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, జస్టిస్ వి.ఎస్. నారాయణ, రసమయి వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఎం.కె.రాము తదితరులు పాల్గొని అవధాన జీవిత స్వర్ణోత్సవం జరుపుకొంటున్న డా. మేడసాని మోహన్‌ను, పృచ్ఛకులను ఘనంగా సత్కరించి మేడసాని మోహన్‌కు స్వర్ణకంకణం బహూకరిస్తున్నట్లు ప్రకటించారు. ముందుగా డా. ఎం.కె.రాము స్వాగతోపన్యాసంలో డా. మేడసాని మోహన్‌చే దిగ్విజయంగా నిర్వహించిన వివిధ అష్టావధానాల గురించి సవివరపరిచారు. సభకు ముందు డా. మేడసాని మోహన్ విజయవంతంగా అష్టావధానం కావించారు. అష్టావధానం పృచ్ఛకులుగా డా. తిరుమల శ్రీనివాసాచార్యులు, డా. టి.గౌరీశంకర్, ఉదయవర్లు, డా. మసన చెన్నప్ప, శంకరనారాయణ, డా. అక్కిరాజు సుందరరామ కృష్ణ, డా.సాధన నరసింహాచారి, డా. శరత్‌జ్యోత్స్నారాణిలు పాల్గొన్నారు.




మేడసానిమోహన్‌కు అవధాన జీవిత స్వర్ణోత్సవ సత్కారం కావిస్తున్న శ్రీనివాసులు, రమణాచారి, జస్టిస్ చంద్రకుమార్, ఎం.కె.రాము, నరసింహప్ప తదితర అతిథులు

# వేడుకలకు రమ్మంటున్న ఫ్లెమింగో విహంగాలు

## పక్షుల పండుగకు పులికాట్ సిద్ధం

**తడ, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలోనే పులికాట్ సరస్సు కేంద్రంగా ఫ్లెమింగో ఫెస్టివల్ పేరుతో పక్షుల పండగ నిర్వహించేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ పండుగను ఇంకా ఘనంగా నిర్వహించి పర్యాటకులను విశేషంగా ఆకర్షించాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈసారి 2001లో ఈ పండుగ ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండటంతో పక్షుల పండుగపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. జనవరి నెలలో ఖచ్చితంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించాలని అధికార యంత్రాంగం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది. ప్రస్తుతం తిరుపతి జిల్లాకు మారిన సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో తడ, సూళ్లూరుపేట, అటకానితిప్ప, నేలపట్టు, భీములవారిపాలెం తదితర చోట్ల పండుగ జరుపుతామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇటీవల ప్రకటించారు. దీనికి తగ్గట్లే సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఒకటికి రెండుసార్లు ముఖ్యమంత్రిని కలిసి ఈ పండుగకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా ఆమె మంగళవారం తాడేపల్లిలో సిఎంను కలిసి ఫ్లెమింగో ఫెస్టివల్‌పై మాట్లాడారు. ఈ సారి ఉమ్మడి ప్రభుత్వంలోని పలువురు ప్రముఖులను ఈ పండుగకు ఆహ్వానించి పక్షుల పండుగకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసిన కారణంగా పులికాట్ సరస్సులో సంమృద్ధిగా నీరు చేరింది. నేలపట్టు చెరువులోని కడప చెట్లపై పక్షులలో రారాజుగా పిలిచే పెలికాన్లు ఎక్కువ సంఖ్యలో కొలువుతీరాయి. గూడబాతుగా ఈ ప్రాంతంవారు ఈ పక్షులను పిలుస్తున్నారు. పులికాట్ సరస్సులో సంవృద్ధిగా నీరు చేరడం వలన విహంగాల విన్యాసాలు ఎక్కువగా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ సముద్రపు రామచిలుకలు అని పిలిచే ఫ్లెమింగోలు గుంపులు గుంపులుగా విహరిస్తున్నాయి. వీటిని తిలకించేందుకు పర్యాటకులకు ఉత్సాహపడుతున్నారు. అయితే స్థానిక వన్యమృగ సంరక్షణవారు విదేశీ విహంగాలపై తగిన ప్రచారం చేయలేకపోతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు కూడా క్రమబద్ధీకరించలేక పర్యాటకులకు ఏ విధంగాను సహకారం అందించడం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహించి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి విహరించి పర్యాటకులకు వినోదం కలిగించే విహంగాలపై ప్రచారం విస్తృతం చేయాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఈసారి ఫలితం ఉంటుందని స్థానికులు కూడా గట్టిగా నమ్ముతున్నారు.



పులికాట్, నేలపట్టులో విదేశీ విహంగాల విన్యాసాలు

# అనారోగ్య సమస్యలతో వృద్ధ దంపతుల ఆత్మహత్య

## పిల్లలకు భారం కాకూడదని ట్యాబెట్లు సేవించి దుర్మణం

**హైదరాబాద్ (ఉప్పల్), డిసెంబరు 11 ప్రభాతవార్త :** ఒక అనారోగ్య సమస్యలు, మరో వైపు ఉన్న ఒక్క కుమారుడు తమకు దూరంగా ఉండడం. వృధ్యాప్యంలో వచ్చిన సమస్యలు తట్టుకోలేక ఉప్పల్‌లో ఒక వృద్ధ దంపతులు గుర్తు తెలియని ట్యాబెట్లు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉప్పల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ సాయిరాంనగర్ కాలనీలో నివసించే దుర్వాసుల సూర్యనారాయణశాస్త్రి (60) ఎన్‌టిపిసిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. అయితే అతనికి భార్య దుర్వాసుల జగదీశ్వరి (54)తోపాటు ఒక కుమారుడు డి.సాయి సుశాంత్(30) ఉన్నాడు. అతనికి పెళ్లి చేయగా స్టాఫ్టవేర్ ఉద్యోగం కారణంగా కోకాపేటలో నివాసం ఉంటున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా సూర్యనారాయణశాస్త్రి భార్య జగదీశ్వరి అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 5వ తేది తన కుమారుడు సుశాంత్‌కు ఢిల్లీ సెమినార్‌కు వెళుతున్నట్లు చెప్పినట్లు తెలిపారు. అప్పటి నుంచి వీరి సెల్‌పోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఉన్నాయి. వీరి ఇంటికి తాళం వేసి ఉండడంతో ప్రతి రోజు పని మనిషి బయట శుభ్రం చేసి వెళుతుందని తెలిపారు. కాగా బుధవారం ఇంటి నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మాధవరెడ్డి, తన సిబ్బందితో అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ఇంట్లో ఇద్దరు విగత జీవులుగా పడి ఉన్నారు. తమ చావుకు ఎవరు కారణం కాదని లెటర్ రాసి పెట్టినట్లు వారు తెలిపారు. వయోభారం, అనారోగ్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని బందువులు ఫిర్యాదు చేశారు. కొద్ది నెలల క్రితమే షష్టిపూర్తి ఘనంగా చేసుకున్నారని, అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడడం తీవ్రంగా కలిచివేసిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దుర్వాసుల సూర్యనారాయణశాస్త్రి, జగదీశ్వరి ( ఫైల్)

# హెల్మెట్ నిబంధన ఎందుకు అమలు చేయరు?

## పోలీసులను ప్రశ్నించిన ఎపి హైకోర్టు

**విజయవాడ, డిసెంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్న నిబంధనను అమలు చేయకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకోవడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ఏడాది జూన్ నుండి సెప్టెంబరు వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించక పోవడం వల్ల చాలా మంది మృతి చెందారని పిటీషనర్ కోర్టుకు తెలిపారు. దీనికి ఎవరు భాధ్యత వహిస్తారని న్యాయస్థానం ప్రశ్నించింది. హెల్మెట్ ధరించాలన్న నిబంధన ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. ట్రాఫిక్ విభాగంలో 8 వేల మంది సిబ్బంది అవసరం కాగా ప్రస్తుతం 1800 మంది మాత్రమే ఉన్నారని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

